సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 15 । ఏప్రిల్ । 2023



పుట్టిన రోజు వేడుకల్లో అపశ్రుతి


పుట్టిన రోజు వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. అప్పటి వరకూ బంధువులతో సరదాగా, సంతోషంగా గడిచిన క్షణాలు అంతలోనే ఆవిరైపోయాయి. - 8లో▸




31 మందికి కోవిడ్

కాకినాడ క్రైం: జిల్లాలో శుక్రవారం 31 మందికి కోవిడ్ నిర్ధారణ అయింది. 227 మంది నుంచి నమూనాలు సేకరించగా ఈ ఫలితం వెలువడింది. బాధితులను హోం ఐసోలేషన్‌లో ఉంచారు.

సాగునీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 1,400,మధ్య డెల్టాకు 450,పశ్చిమ డెల్టాకు 3వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 4.55 అడుగులకు చేరింది.



న్యూస్‌రీల్

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ



అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభిస్తున్న జిల్లా రవాణా అధికారి అశోక్ ప్రతాప్

అమలాపురం టౌన్: మానవ తప్పిదాలతో జరిగే అగ్ని ప్రమాదాలను అప్రమత్తతతోనే చాలా వరకూ నివారించగలమని జిల్లా రవాణా అధికారి అశోక్ ప్రతాప్ అన్నారు. ఈ నెల 20వ తేదీ వరకూ జరిగే అగ్నిమాపక వారోత్సవాలను స్థానిక అగ్నిమాపక కేంద్రం వద్ద ఆయన శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించి పలు సూచనలు చేశారు. అగ్నిమాపక కేంద్రంలో ప్రదర్శించిన అగ్ని ప్రమాదాల నివారణ యంత్రాలు, పరికరాలను అశోక్ ప్రతాప్ పరిశీలించారు. అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆ శాఖ ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. తొలుత అగ్నిమాపక సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. స్థానిక అగ్నిమాపక అధికారి కేవీ మురళీ కొండబాబు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్రం లీడ్ ఫైర్‌మన్ బలరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

రత్నగిరికి భక్తుల తాకిడి



క్యూ లైన్ మండపంలో క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. శుక్రవారం సుమారు 30 వేల మంది సత్యదేవుని దర్శించారని అధికారులు అంచనా. 1,500 వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. ప్రస్తుతం వ్రతాలు జమ్మి పత్రితో నిర్వహిస్తున్నారు. రూ.1,500, రూ.2 వేల వ్రతాలు మినహా మిగిలిన వ్రతాల్లో ఈ పత్రినే వాడుతున్నారు. సాధారణంగా మారేడు పత్రితో వ్రతాలు నిర్వహిస్తారు. వేసవిలో మారేడు చెట్లు ఆకులన్నీ రాల్చేసి చిగురుటాకులు వస్తాయని సంబంధిత సిబ్బంది తెలిపారు. జూన్ నాటికి ఆకులు పెద్దవై పత్రిగా ఉపయోగపడతాయని చెప్పారు. వేసవిలో సుమారు రెండు నెలలు మారేడు పత్రి బదులు జమ్మి పత్రి వాడతామన్నారు. కాగా ఆలయం సమీపంలోని క్యూ మండపంలోకి వచ్చేటప్పటికి గంట సమయం పడుతోంది. మండపంలో చల్లని మంచినీరు సరఫరా లేక ఇబ్బంది పడుతున్నారు. కుళాయి ఉన్నప్పటికీ ఆ నీరు ఎండకు వేడిగా మరిగిపోతున్నాయి. పెద్ద కుండలో చల్లని నీరు భక్తులకు సరఫరా చేస్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

18 త్రీమెన్ కమిటీల్లో మార్పులు

అమలాపురం టౌన్: జిల్లాలోని 166 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్)కు అప్పటికే నియమించిన త్రీమెన్ కమిటీల (పర్సన్ ఇన్‌చార్జి కమిటీలు) పదవీ కాలాన్ని గత జనవరిలోనే రాష్ట్ర సహకార శాఖ పొడిగించింది. 2019 నుంచి ఈ త్రీమెన్ కమిటీల పదవీ కాలాన్ని ప్రతి ఆరు నెలలకోసారి పొడిగిస్తూ కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా పి.గన్నవరం, కొత్తపేట, ముమ్మిడివరం, రాజోలు నియోజకవర్గాలకు చెందిన 18 సంఘాల కమిటీల్లో కొన్ని మార్పులు, చేర్పులతో కొత్త కమిటీలను నియమిస్తూ రాష్ట్ర సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కొన్ని సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జి (సంఘం చైర్మన్) పదవికి కొత్త వారిని ఎంపిక చేయగా, మరికొన్ని సంఘాల్లో సభ్యులను మార్చారు. పి.గన్నవరం నియోజకవర్గంలో 10, కొత్తపేట నియోజకవర్గంలో 6, ముమ్మిడివరం, రాజోలు నియోజకవర్గాల్లో ఒక్కో సంఘానికి కొత్త కమిటీల నియామకాలు జరిగాయి. జిల్లాలోని 18 సహకార సంఘాలకు కొన్ని మార్పులతో కొత్త పర్సన్ ఇన్‌చార్జి కమిటీల నియామకాలకు పేర్లు సూచిస్తూ ఉత్తర్వులు వచ్చాయని, వాటిని ఆయా సంఘాల సీఈఓలు అమలు చేస్తున్నారని జిల్లా సహకార అధికారి ఎ.రాధాకృష్ణారావు 'సాక్షి'కి తెలిపారు.

ఉపాధి.. వడివడిగా..

- జిల్లాలో 30.85 లక్షల పనిదినాల లక్ష్యం
- వేసవిలో 65 శాతం పనులు చేసేందుకు ప్రణాళికలు
- ప్రధాన కాలువల్లో పూడికల తొలగింపు
- అమృత సరోవర్‌తో పాటు మిగిలిన చెరువుల్లో కూడా పూడికతీతకు అవకాశం



పి.గన్నవరం మండలం రావిపాడులో 'అమృత సరోవర్'కు ఎంపికైన చెరువు ఆధునీకరణకు చేపట్టిన ఉపాధి పనులు

సాక్షి, అమలాపురం: ఉపాధి పనులకు వేసవి అనుకూలమైన కాలం. ఒకవైపు పంట కాలువల మూసివేత.. మరోవైపు ఖాళీగా ఉండే పంట చేలు.. నీరు లేక ఎండిపోయే చెరువులు.. పుంత రోడ్ల నిర్మాణాలకు మట్టి సేకరించే అవకాశం.. ఇన్ని సానుకూలతలు ఉండటంతో వేసవిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) పనులు వేగంగా చేయాలని జిల్లా యంత్రాంగం భావిస్తోంది. దీనిలో భాగంగా ఈ వేసవిలో రికార్డు స్థాయిలో పనులు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

పనులు చేపట్టనున్నారిలా..

- వేసవిలో కాలువల మీద పనులు చేసే అవకాశం ఎక్కువ. ఈ నెల 20వ తేదీ నుంచి డెల్టాలో పంట కాలువలు మూసివేయనున్నారు. ఇదే అదనుగా ప్రధాన పంట కాలువల్లో పూడికల తొలగింపు, గట్ల పటిష్టత, తుప్పల తొలగింపు వంటి పనులు చేపట్టనున్నారు. ప్రధాన పంట కాలువలతో పాటు చానల్స్, పంట బోదెల్లో ఈ పనులు చేయనున్నారు. వీటితో పాటు మురుగునీటి కాలువల్లో నీరు తగ్గడం వల్ల తూడు, గుర్రపు డెక్క తొలగింపునకు అనుకూలంగా ఉంటుంది. కాలువ వెంబడి పూడికతీత పనులు కూడా చేయనున్నారు. గత ఏడాది పంట, మురుగునీటి కాలువలపై 4,507 వరకూ పనులు చేపట్టారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు ఆరంభ సమయానికి మురుగునీటి కాలువల్లో పూడిక తొలగింపు పనులు అధికంగా చేయనున్నారు.
- అమృత సరోవర్ పథకంలో గ్రామీణ చెరువుల ఆధునీకరణ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ పథకం కింద గత ఏడాది జిల్లాలో రూ.5.90 కోట్లతో 71 చెరువుల ఆధునీకరణ పనులు చేపట్టారు. వీటిలో మిగిలిన పనులతో పాటు ఆయా గ్రామాల్లో ఎంపిక చేసిన చెరువుల పనులు ఆరంభించనున్నారు. చెరువుల్లో మట్టి తొలగింపుతో పాటు గట్లు ఎత్తు చేయనున్నారు.
- రైతులకు ప్రయోజనం కలిగించేలా వరి చేల గట్లను పటిష్టం చేయడంతో పాటు కొబ్బరి తోటల్లో పళ్లాలు వేయడం వంటి పనులు కూడా పెద్ద ఎత్తున చేపట్టే అవకాశముంది. అలాగే తోటల్లో మోటార్ల ద్వారా నీరు పారేలా బోదెలు నిర్మించనున్నారు. గత ఏడాది 1,367 మంది రైతులకు చెందిన కొబ్బరి తోటల్లో చెట్ల చుట్టూ పళ్లాల తవ్వకం చేపట్టారు. రైతుకు సంబంధించి అరెకరం, ఒకటి రెండెకరాల తోటల్లో 40 నుంచి 150 వరకూ చెట్లకు పళ్లాలు తవ్వారు. వీటితో పాటు రైతుల కమతాల్లో చిన్నచిన్న చెరువుల నిర్మాణాలు చేస్తారు.
- గ్రామీణ ప్రాంతాల్లో పుంత రోడ్లను మట్టి రోడ్లుగా ఆధునీకరించనున్నారు. గోదావరి లంకల్లో సైతం మట్టి రోడ్లను పటిష్టం చేయనున్నారు. పి.గన్నవరం, ముమ్మిడివరం, అయినవిల్లి, మామిడికుదురు మండలాల్లోని లంక గ్రామాల్లో ఈ పనులు చేపట్టనున్నారు. లంకల్లో వరద గట్ల నిర్మాణాలు చేపట్టనున్నారు.
- వీటితో పాటు మునగ తోటల పెంపకంతో పాటు రహదారుల వెంబడి మొక్కలు పెంచనున్నారు.

వేసవిలో కనీసం 20 లక్షల పనిదినాలు

గత ఏడాది జిల్లా రెండుసార్లు లక్ష్యాలను అధిగమించింది. దీంతో ఈ వేసవిలో జిల్లాకు ప్రభుత్వం భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈ వేసవిలో ఏప్రిల్ నుంచి జూన్ మొదటి వారం వరకూ జిల్లాలో 30.85 లక్షల పని దినాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. ఏడు నియోజకవర్గాల పరిధిలోని 22 మండలాల్లో ఈ వేసవిలో పనులు చేపట్టనున్నారు. గత ఏడాది జిల్లాలో రికార్డు స్థాయిలో ఉపాధి పనులు రికార్డు స్థాయిలో జరిగాయి. జిల్లావ్యాప్తంగా గత ఏడాది 30 లక్షల పనిదినాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. దానిని పూర్తి చేయడంతో పనిదినాలను 47 లక్షలకు పెంచింది. అది కూడా పూర్తి చేయడంతో మూడోసారి పనిదినాలను 62 లక్షలకు పెంచింది. దీనిని కూడా డ్వామా అధికారులు చేసి చూపించారు. ఏకంగా రూ.184.50 కోట్ల విలువైన పనులు చేశారు. ఈ ఏడాది కూడా కేటాయించిన లక్ష్యాన్ని ముందుగానే పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ వేసవిలో కనీసం 65 శాతం పనులు అంటే కనీసం 20 లక్షల పనిదినాలు పూర్తి చేయాలని భావిస్తున్నారు.

జిల్లాలో నియోజకవర్గాల వారీగా పనుల కేటాయింపు

నియోజకవర్గం	పని దినాల లక్ష్యం
అమలాపురం	4,92,866
పి.గన్నవరం	5,79,176
రాజోలు	3,76,202
కొత్తపేట	5,19,000
ముమ్మిడివరం	4,34,696
రామచంద్రపురం	2,85,830
మండపేట	3,97,277
మొత్తం	30,85,047

వేసవిలో అధిక పనులు



వేసవిలో అత్యధిక పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రధానంగా వ్యవసాయ అనుబంధంగా రైతులకు మేలు చేసే పనులు ఎక్కువగా చేయనున్నాం. వేసవి ఎండల ప్రభావం ఉపాధి కూలీల మీద పడకుండానే తగు జాగ్రత్తలతో పనులు పూర్తి చేస్తాం.

– ఎస్.మధుసూదనరావు, డ్వామా పీడీ

21 నుంచి పంట కాలువల మూసివేత

అమలాపురం రూరల్: గోదావరి తూర్పు, మధ్య డెల్టాల కాలువలను ఈ నెల 21 నుంచి మూసివేయనున్నట్టు కలెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈలోగా జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లోని వేసవి చెరువులను, రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపుకోవాలని ఆదేశించారు.

ఆకెళ్ల శివప్రసాద్‌కు కందుకూరి పురస్కారం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఆ నలుగురు, రంగమార్తాండ సినిమాలకు కథ, మాటలు రాసిన ఆకెళ్ల శివప్రసాద్‌కు కందుకూరి సాహితీ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు కళాగౌతమి, తెలుగు సారస్వత పరిషత్ అధ్యక్షురాలు జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. తన నివాసంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా స్థానిక సంహిత కళాశాలలో ఆకెళ్లకు ఆదివారం ఈ పురస్కారం ప్రదానం చేస్తామని తెలిపారు. అనేక టీవీ సీరియళ్లకు కథాసాహిత్యం అందించడమే కాకుండా, నవలలు, నాటకాలు, బాలసాహిత్యం, కథలు వంటి అనేక ప్రక్రియల్లో ఆకెళ్ల ప్రతిభ చూపారన్నారు. కార్యక్రమంలో బీవీఎస్ మూర్తి, భాను ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్స్ చైర్మన్ జక్కంపూడి సత్యనారాయణ, తెలుగు శాఖాధిపతి డాక్టర్ పీవీ సంజీవరావు, ఆధ్యాత్మికవేత్త చెవ్వాకుల వంశీకృష్ణ, విద్యార్థి సంఘ నాయకుడు చర్ల సీతారామనాయుడు పాల్గొన్నారు.

కూరగాయలు, పాలు, పెరుగు సరఫరాకు టెండర్ల ఆహ్వానం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి మే 1 నుంచి 31 వరకూ కూరగాయలు, పాలు, పెరుగు సరఫరా చేయడానికి టెండర్లు స్వీకరిస్తున్నట్లు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండరులో పాల్గొనే వారు కూరగాయలకు రూ.5 వేలు, పాలు, పెరుగుకు రూ.5 వేల చొప్పున ధరావత్తు చెల్లించాలన్నారు. కూరగాయలకు రూ.6 లక్షలు, పాలు, పెరుగు రూ.5 లక్షల వరకూ విలువ ఉంటుందన్నారు. ఈ నెల 15వ తేదీ లోపుగా టెండర్లు వేయాలన్నారు.

ఆన్‌షోర్..ఆఫ్‌షోర్..ఎనీవేర్..

- సముద్ర దొంగలకు అన్ని వైపులా చెక్
- చమురు చోరీల నివారణకు ఉమ్మడి భద్రత
- ఓవైపు కోస్ట్‌గార్డు, మరోవైపు పోలీస్ శాఖ



చమురు తెట్టును తొలగించడంపై ఆదేశాలిస్తున్న కోస్ట్‌గార్డ్ కమాండెంట్

కాకినాడ క్రైం: ఆన్‌షోర్, ఆఫ్‌షోర్, ఎనీవేర్... ఇదీ చమురు దోపిడీలను నిలువరించేందుకు భద్రతా వ్యవస్థలు అనుసరిస్తున్న తాజా విధానం. సముద్ర ఉపరితలంపై కోస్టుగార్డ్, తీర ప్రాంతాల్లో పోలీస్, ఎస్‌పీఎఫ్, మెరైన్ పోలీస్ తమ భద్రతా వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఈ ప్రక్రియలో భాగంగానే గురువారం వరకూ చేపట్టిన మాక్‌డ్రిల్ ప్రాధాన్యం సంతరించుకుంది.

ముగిసిన సముద్ర జలశుద్ధి ప్రక్రియ

కాకినాడ తీరంలో మూడు రోజుల సముద్ర జలశుద్ధి ప్రక్రియ ముగిసింది. ఇండియన్ కోస్టుగార్డు ఆధ్వర్యంలో కాకినాడ స్టేషన్ పరిధిలో యుద్ధ ప్రదర్శనను తలపించే రీతిలో రీజినల్ పొల్యూషన్ రెస్పాన్స్ ఎక్సర్‌సైజ్ పేరుతో భారీ మాక్‌డ్రిల్ నిర్వహించారు. కాకినాడ కోస్టుగార్డు స్టేషన్ కమాండెంట్ ఆఫీసర్ జి.వేణుమాధవ్ సారథ్యంలో భారీ స్థాయిలో చేపట్టిన ఈ మాక్ డ్రిల్ సముద్ర జలాల్లో చమురు తెట్లను తొలగించే ప్రక్రియతో పాటు భద్రతా పరమైన అంశాలకు నిర్వహణకు ఓ ట్రయల్‌గా అధికారులు తెలిపారు.

అటు పోలీస్ శాఖ

కోస్టుగార్డుతో సహా అటు పోలీస్ శాఖ సముద్ర తీర ప్రాంత అనుబంధంగా జరిగే చమురు దోపిడీలపై దృష్టి సారించింది. డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, డీఐజీ పాలరాజు ఆధ్వర్యాన సముద్ర తీర సరిహద్దు ఉన్న అన్ని జిల్లాల ఎస్పీలతో ఇటీవల రాజమహేంద్రవరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇందులో జిల్లాల వారీగా చమురు చోరీల గణాంకాలపై చర్చించారని కాకినాడ జిల్లా పోలీస్ వర్గాలు తెలిపాయి. చమురు దొంగతనాలకు పాల్పడ్డ పాత నిందితుల కదలికలపై నిఘా ఉంచాలని ఎస్పీలను డీజీపీ ఆదేశించారు. ఈ మేరకు ఎస్పీలు యంత్రాంగాన్ని సమాయత్తపరిచారు.

చమురు లీకైతే ...

చమురు తరలించే రెండు ఓడలు ప్రమాదవశాత్తు లేదా దాడుల నేపథ్యంలో సముద్రంలో ఢీకొంటే లేదా లీకేజీలు ఏర్పడితే సముద్ర జీవులకు ప్రాణ సంకటమని కమాండెంట్ వేణుమాధవ్ తెలిపారు. లీకైన చమురు ఆక్సిజన్‌ను నీటిలోకి వెళ్లకుండా అడ్డుకుంటుందని అన్నారు. తద్వారా జీవాలు ప్రాణాలు కోల్పోతాయని తెలిపారు. నీటి నుంచి చమురును వేరు చేసే ప్రక్రియకు అధునాతన పరికరాలను కోస్టుగార్డు వినియోగించింది. మాక్‌డ్రిల్‌లో 85 మంది సైలర్లు, 12 మంది అధికారులు పాల్గొన్నారు.

డొక్కపొట్టు.. కాసులు పట్టు

- ఇటుకల తయారీకి, నర్సరీలకు వినియోగం
- ప్రస్తుతం మంచి డిమాండ్
- ఇతర జిల్లాలకూ ఎగుమతులు
- టన్నుకు రూ.2 వేల ఆదాయం

మామిడికుదురు: కొబ్బరి డొక్కపొట్టుకూ ఓ రోజు వచ్చింది. ఇటీవల దీనికి ఎక్కడ లేని డిమాండూ వచ్చింది. గతంలో పీచు మిల్లుల వద్ద కొండలను తలపించేలా డొక్క పొట్టు గుట్టలు గుట్టలుగా కనిపించేది. ఉచితంగా ఇస్తామన్నా, దీనిని తీసుకు వెళ్లేందుకు ఎవరూ ఇష్టపడే వారు కాదు. పీచు పరిశ్రమల యజమానులకు డొక్క పొట్టు పెద్ద సమస్యగా ఉండేది. ఇప్పుడలా కాదు. పదేళ్ల నుంచి క్రమక్రమంగా డొక్కపొట్టును ఇటుకల తయారీలో వాడటం మొదలు పెట్టారు. మట్టిలో డొక్కపొట్టు కలిపి చేసిన ఇటుకలు తేలికగా, అత్యంత నాణ్యంగా ఉంటున్నాయని చెబుతున్నారు. దీంతో కోనసీమలో ఎక్కువగా లభ్యమయ్యే డొక్కపొట్టును లారీల్లో ఇటుక బట్టీల యజమానులు భారీగా తరలించుకు పోతున్నారు. ఇటుకల తయారీతో పాటు నర్సరీలకు కూడా డొక్కపొట్టును పెద్ద మొత్తంలో వినియోగిస్తున్నారు. దీంతో దీనికి డిమాండ్ మరింత పెరిగింది. పీచు ఫ్యాక్టరీల వద్ద చూద్దామన్నా మచ్చుకు కూడా డొక్కపొట్టు కనిపించడం లేదు.

15 నుంచి 20 టన్నులు ఉత్పత్తి : కోనసీమలో సుమారు 100 కొబ్బరి పీచు పరిశ్రమలున్నాయి. వివిధ కారణాలతో వాటిలో ప్రస్తుతం 50 మాత్రమే పని చేస్తున్నాయి. ఈ పరిశ్రమల నుంచి రోజుకు 15 నుంచి 20 టన్నుల డొక్కపొట్టు ఉత్పత్తి అవుతుంది. ఒక లారీ ద్వారా 25 టన్నుల డొక్క పొట్టు ఎగుమతి అవుతుంది. ప్రస్తుతం టన్ను పొట్టును రూ.2 వేలకు అమ్ముతున్నారు. స్థానికంగా ఉన్న ఇటుక బట్టీలతో పాటు ఒంగోలు, గుంటూరు, కర్నూలు తదితర జిల్లాల్లోని నర్సరీలకు కూడా ఇది ఎగుమతి అవుతుంది. ఇటుకల తయారీ ఎక్కువగా ఉండటంతో వేసవిలో డొక్కపొట్టుకు ఎక్కువ డిమాండ్ ఉంటుందని పీచు పరిశ్రమల నిర్వాహకులు చెబుతున్నారు. డొక్కతాడు ధరలు దారుణంగా పడిపోయిన ప్రస్తుత తరుణంలో పీచు పరిశ్రమలకు పొట్టే ప్రస్తుతం ఆదాయ వనరుగా మారింది.



ఇటుకల తయారీలో ఉపయోగిస్తున్న డొక్కపొట్టు

డిమాండ్ ఎక్కువగా ఉంది



డొక్కపొట్టుకు ప్రస్తుతం డిమాండ్ ఎక్కువగా ఉంది. ఇటుకల తయారీలో దీనిని ముడి పదార్థంగా వినియోగించడమే దీనికి ప్రధాన కారణం. దీనికి ఎనలేని డిమాండ్ రావడంతో ఎక్కడా పొట్టు దొరకని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం పీచు పరిశ్రమల నిర్వాహకులకు ఆదాయం తెస్తున్నది డొక్క పొట్టు మాత్రమే. ఇదే పరిస్థితి కొనసాగాలని కోరుకుంటున్నాం.

– వేగి వెంకటేశ్వరరావు, పీచు పరిశ్రమ యజమాని, పెదపట్నంలంక

నాణ్యంగా ఉంటున్నాయి



డొక్కపొట్టుతో తీసిన ఇటుకలు ఎంతో నాణ్యంగా ఉంటున్నాయి. కాల్పు కూడా బాగుంటోంది. తాపీమేస్త్రులు కూడా డొక్కపొట్టుతో తీసిన ఇటుకలు వాడేందుకే మొగ్గు చూపుతున్నారు. పొట్టుతో తయారు చేసిన ఇటుక బరువు ఒకటిన్నర కిలోలు ఉంటుంది. అదే ఊక, బూడిద కలిపి తీసిన ఇటుక బరువు రెండు కిలోలు ఉంటుంది. భవనాల నిర్మాణానికి తేలికపాటి ఇటుకలే మంచిదని చెబుతూండటంతో వీటినే ఎక్కువగా వాడుతున్నాం.

– యాలి శ్రీనివాస్, మామిడికుదురు

డొక్కపొట్టు కలిపి ఇటుకలు తీస్తున్నాం



మట్టిలో డొక్కపొట్టు కలిపి ఇటుకలు తీస్తున్నాం. గతంలో మట్టిలో ఊక, బూడిద కలిపి ఇటుకలు తీసేవాళ్లం. డొక్కపొట్టు కలిపిన మట్టితో చేయడం వల్ల ఇటుకల్లో నాణ్యత పెరిగింది. తక్కువ బరువుతో ఇటుకలు తయారవుతున్నాయి. కట్టడాలకు ఈ ఇటుకలనే ఎక్కువగా వాడటం వల్ల మేం కూడా డొక్కపొట్టు కలిపిన ఇటుకలు తీసేందుకు మొగ్గు చూపుతున్నాం.

– పేరూరు వెంకటేశ్వరరావు, ఇటుక బట్టీ యజమాని, బి.దొడ్డవరం

అంబేడ్కర్.. ప్రపంచ కీర్తి శిఖరం

- రాజ్యాంగ నిర్మాత జయంతి వేడుకల్లో మంత్రి విశ్వరూప్
- ఆ మహనీయునికి ఘనంగా నివాళి



అమలాపురం మద్దాలవారిపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి విశ్వరూప్



రామచంద్రపురంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన మంత్రి వేణు



హసన్‌బాదలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎంపీ బోస్

అమలాపురం టౌన్: రాజ్యాంగ రచనతో ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వవ్యాపితం చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రపంచ కీర్తి శిఖరమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. పట్టణంలోని పలు అంబేడ్కర్ విగ్రహాల వద్ద ఆ మహనీయుని 132వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పలు ప్రాంతాల్లో మంత్రి విశ్వరూప్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పట్టణంలోని మద్దాలవారిపేట, సాయంపేట, గ్రంధివారిపేట, గడియారం స్తంభం సెంటర్, ఈదరపల్లి వంతెన వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మరో అతిథి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ, అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరం ముందడుగు వేసి, సమసమాజ స్థాపనకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, మున్సిపల్ కౌన్సిలర్లు నాగారపు వెంకటేశ్వరరావు, దొంగ నాగ సుధారాణి, కొల్లాటి దుర్గాబాయి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ బాటలోనే సీఎం అడుగులు

రామచంద్రపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తిని ఆకళింపు చేసుకుని, ఆయన చూపిన బాటలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు అడుగులు వేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా రామచంద్రపురం మెయిన్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం లోతైన అధ్యయనం చేసి, రాజ్యాంగాన్ని రచించిన ప్రపంచ మేధావి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, కౌన్సిలర్లు కేతా సుజాత, నల్లా అమ్మాజీ, కేతా శ్రీను, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, నాయకులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎంపీ బోస్ నివాళి

రామచంద్రపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు వైఎస్సార్ సీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ స్వగ్రామం హసన్‌బాదలో ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విలువలతో కూడిన గొప్ప రాజనీతిజ్ఞుడు అంబేడ్కర్ అని అన్నారు. బోస్ తనయుడు సూర్యప్రకాశ్, సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ



కలెక్టరేట్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా తదితరులు

అమలాపురం రూరల్: కలెక్టరేట్ ప్రాంగణంలో కొత్తగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రారంభించి, పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత సమాజానికి, ప్రజాస్వామ్యానికి అంబేడ్కర్ చేసిన కృషి ఎనలేనిదని అన్నారు. ఆ మహనీయుని స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రభుత్వం నవరత్న పథకాల ద్వారా అర్హులైన వారికి ఇంటి ముంగిటే సంక్షేమ ఫలాలు అందిస్తోందని, ఎస్సీ, ఎస్టీల భద్రతకు అత్యంత ప్రాధాన్యం కల్పిస్తోందని అన్నారు. జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ మాట్లాడుతూ, అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచ దేశాలకు సైతం ఆదర్శంగా ఉందని చెప్పారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ, దళిత జనసాంద్రత ఉన్న కోనసీమ జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టి ఆ మహనీయునికి సముచిత గౌరవం ఇచ్చిందని అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, జెడ్పీటీసీ సభ్యులు శ్రీహరి రామ్‌గోపాల్, గెద్దం సంపత్‌రావు, వరలక్ష్మి, శైలజ, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జిల్లా అధికారులు, దళిత నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డాక్టర్ గన్నికి అరుదైన గౌరవం



తాష్కెంట్ సదస్సులో ఆడియో విజువల్ ప్రజెంటేషన్ ఇస్తున్న డాక్టర్ గన్ని భాస్కరరావు

రాజానగరం: స్థానిక జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చీఫ్ మెంటర్, సర్జన్ డాక్టర్ గన్ని భాస్కరరావుకు అరుదైన గౌరవం లభించింది. ఉజ్బెకిస్తాన్‌లోని బుఖారా రాష్ట్రం 'అబూ అలీ ఇన్ సైనో' వైద్య సంస్థకు గౌరవ డాక్టర్‌గా, తాష్కెంట్ మెడికల్ అకాడమీలో గౌరవ ప్రొఫెసర్‌గా ఆయన నియమితులయ్యారు. వైద్య రంగంలో అంతర్జాతీయ సహకారం కోసం మధ్య ఆసియాలోని ఉజ్బెకిస్తాన్ వైద్య, ఆరోగ్య శాఖ తాష్కెంట్‌లో మూడు రోజుల పాటు సమావేశం నిర్వహించింది. ఇందులో కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు అనుసంధానం చేసే ప్రక్రియపై డాక్టర్ గన్ని గురువారం ఆడియో విజువల్ ప్రజెంటేషన్ ఇచ్చారు. బుఖారా వైద్య సంస్థ ఎంపిక చేసిన వారికి సర్జికల్ ఆంకాలజీ, నెక్ అండ్ హెడ్ సర్జరీలు రోబోటిక్ సర్జరీలు, మెడికల్ సిమ్యులేషన్, నర్స్ ట్రైనింగ్‌లో జీఎస్ఎల్ విద్యా సంస్థలు శిక్షణ ఇస్తారని డాక్టర్ గన్ని శుక్రవారం తెలిపారు. విజ్ఞానాన్ని పరస్పరం మార్పిడి చేసుకునే విధానంపై జీఎస్ఎల్ ఇప్పటికే పలు దేశాల్లోని వైద్య విశ్వవిద్యాలయాలతో ఒడంబడికలు చేసుకుంది. తాజాగా ఉజ్బెకిస్తాన్‌లోని రెండు యూనివర్సిటీలతో కూడా జీఎస్ఎల్ ఒప్పందం కుదుర్చుకుంది.

క్యాన్సర్‌పై అధ్యయనాలకు అంతర్జాతీయ గుర్తింపు



ఎన్‌సీసీఎన్ సమ్మేళనంలో మాట్లాడుతున్న డాక్టర్ తరుణ్

రాజానగరం: క్యాన్సర్‌పై జీఎస్ఎల్ ఆంకాలజీ విభాగం చేస్తున్న అధ్యయనాలకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. నేషనల్ కాంప్రహెన్సివ్ క్యాన్సర్ నెట్‌వర్క్ (ఎన్‌సీసీఎన్) అమెరికాలోని ఫ్లోరిడాలో నిర్వహించిన 2023 వార్షిక సమ్మేళనంలో క్యాన్సర్‌పై జీఎస్ఎల్ క్యాన్సర్ ఆస్పత్రి ఆంకాలజిస్టు డాక్టర్ గోగినేని తరుణ్ రూపొందించిన రెండు మెడికల్ పోస్టర్లకు గుర్తింపు లభించింది. గ్రామీణ ప్రాంతాల్లో స్త్రీల వద్దకే వెళ్లి, క్యాన్సర్ పరీక్షలు చేయడంలో సమస్యలపై అనేక మంది వైద్యులు ఈ సమ్మేళనంలో వివరించారు. మన దేశం నుంచి ఏకైక ప్రతినిధిగా డాక్టర్ తరుణ్ ఒక్కరే హాజరయ్యారు.

పుట్టిన రోజు వేడుకల్లో అపశ్రుతి

- గోదావరిలో స్నానానికి దిగి,
- ముగ్గురి గల్లంతు
- దొరకని ఆచూకీ
- రెండు గ్రామాల్లో విషాద ఛాయలు



పితాని రాజేంద్ర (పాత చిత్రం)



కొప్పిశెట్టి సాయి రామ్ (పాత చిత్రం)



మట్టపర్తి రాజేంద్ర (పాత చిత్రం)



సురక్షితంగా బయటపడిన వారి నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ దుర్గారావు, ఎస్సై చిరంజీవి

కె.గంగవరం: పుట్టిన రోజు వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. అప్పటి వరకూ బంధువులతో సరదాగా, సంతోషంగా గడిచిన క్షణాలు అంతలోనే ఆవిరైపోయాయి. వేర్వేరు గ్రామాలకు చెందిన ఆరుగురు గౌతమీ గోదావరిలో స్నానం చేస్తుండగా ముగ్గురు గల్లంతైన ఘటన వారి కుటుంబ సభ్యులకు విషాదాన్ని పంచింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కూళ్ల గ్రామం వద్ద ఈ ఘోరం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై కె.చిరంజీవి కథనం ప్రకారం.. మండలంలోని పామర్రు గ్రామానికి చెందిన కొప్పిశెట్టి సాయి రామ్ (24) పుట్టిన రోజు శుక్రవారం. ఈ సందర్భంగా బంధువులైన మట్టపర్తి ఆనంద్ (32), కాకినాడ జిల్లా కరప మండలం వేళంగికి చెందిన పితాని రాజేంద్ర(25), వనుము శివనారాయణ, కొప్పిశెట్టి దొరబాబు (శంకర్), కొప్పిశెట్టి గోవిందుతో కలసి సాయిరామ్ కూళ్ల గ్రామంలోని గౌతమీ గోదావరి తీరానికి వెళ్లాడు.

సుడుల్లో ఈదలేక..

రామచంద్రపురంలో మధ్యాహ్నం బిర్యానీ తీసుకుని ఈ ఆరుగురూ కూళ్ల గ్రామానికి రెండు గంటల ప్రాంతంలో చేరుకున్నారు. అనంతరం అందరూ బిర్యానీ తిని, పార్టీ చేసుకున్నారు. నాలుగు గంటల ప్రాంతంలో గోదావరి నదిలో స్నానానికి దిగారు. అప్పటి వరకూ గోదావరి లోతు తక్కువగా ఉండటంతో నడుచుకుంటూ పక్కనే ఉన్న తిప్ప వరకూ వెళ్లారు. అక్కడ కొంతసేపు ఉండి, తిరిగి రావడానికి బయలుదేరారు. ఆ సమయంలో గోదావరి ఉధృతి పెరిగిందని భావించి, వచ్చిన దారిలో కాకుండా వేరే మార్గంలో ఈత కొడుతూ బయలుదేరారు. మధ్యలోకి వచ్చేసరికి గోదావరిలో సుడులు ఉండటంతో ఈదలేక సాయిరామ్, ఆనంద్, రాజేంద్ర గల్లంతయ్యారు. మిగిలిన ముగ్గురిలో ఒకరు ఒడ్డున ఉండగా ఇద్దరు సుడుల్లో కొట్టుకుపోతూనే పరస్పరం సాయం చేసుకుంటూ సురక్షితంగా బయట పడ్డారు. సాయిరామ్, ఆనంద్, రాజేంద్ర గల్లంతయ్యారని స్థానికులకు, బంధువులకు వారు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న రామచంద్రపురం డీఎస్పీ బాలచంద్రారెడ్డి, సీఐ దుర్గారావు, ఎస్సై కె.చిరంజీవి సంఘటన స్థలానికి చేరుకున్నారు. సురక్షితంగా బయటపడిన వారి నుంచి వివరాల సేకరించారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు.

విషాదంలో కుటుంబ సభ్యులు

గల్లంతైన వారిలో కొప్పిశెట్టి సాయిరామ్ కాకినాడ హెరిటేజ్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. తల్లిదండ్రులకు అతడు ఒక్కగాక ఒక్క కుమారుడు. రాజేంద్ర తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. వారికి ఇద్దరు సంతానం. రాజేంద్ర వేళంగి గ్రామంలో కేబుల్ వర్క్ చేస్తున్నాడు. ఈ ఘటనలో గల్లంతైన మట్టపర్తి ఆనంద్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి వివాహమైంది. భార్య ఏడు నెలల గర్భిణి. సాయి, ఆనంద్ గల్లంతుతో పామర్రులో విషాద ఛాయలు అలముకున్నాయి. మరోవైపు వేళంగి గ్రామంలో పని చేసుకుంటూ నడకుదురులో నివాసం ఉంటున్న రాజేంద్ర కుటుంబంలో కూడా విషాదం అలముకుంది.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్టు



గంజాయి, నిందితుడితో ఎస్ఈబీ సిబ్బంది

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై స్కూటర్‌లో గంజాయిని తరలిస్తున్న ఓ యువకుడిని ప్రత్తిపాడు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఈబీ సీఐ పి.అశోక్ కథనం ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం బిళ్ళకుర్రు గ్రామానికి చెందిన దేగల సంజీవకుమార్ అక్కడి శతాబ్ది డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతూ మధ్యలోనే మానేశాడు. గంజాయి బాట పట్టాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం లంబసింగి నుంచి స్కూటర్‌పై గంజాయి తీసుకువస్తూ కొన్నాళ్లుగా ఆ కళాశాల విద్యార్థులకు విక్రయిస్తున్నాడు. ఇదే విధంగా గంజాయి తరలిస్తూ ఎస్ఈబీ పోలీసులకు చిక్కాడు. సంజీవకుమార్ నుంచి మూడు కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్ తెలిపారు.

బాలల అక్రమ రవాణాకు బ్రేక్



రైల్వేలో అక్రమంగా రవాణా అవుతున్న పిల్లలను రక్షించిన ఆర్‌పీఎఫ్ సిబ్బంది

- కోయంబత్తూరు, చెన్నైకి తరలిస్తుండగా అడ్డుకున్న ఆర్‌పీఎఫ్ దళాలు
- విశాఖ వసతి గృహానికి 15 మంది పిల్లల తరలింపు
- అందరూ ఒడిశా, బిహార్, జార్ఖండ్ వాసులు

రాజమహేంద్రవరం సిటీ: బాలల అక్రమ రవాణాకు రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) సిబ్బంది అడ్డుకట్ట వేశారు. ముందస్తు సమాచారంతో అప్రమత్తమై, 15 మంది బాల బాలికలను రక్షించారు. ఆర్‌పీఎఫ్ అదనపు సెక్యూరిటీ కమిషనర్ ఎంఎస్ చౌహాన్ కథనం ప్రకారం.. ఒడిశా, బిహార్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన 14 నుంచి 17 ఏళ్ల వయస్సున్న బాల బాలికలను తమిళనాడులోని చెన్నై, కోయంబత్తూర్‌లకు అక్రమంగా తరలిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం అందింది. జార్ఖండ్‌లోని జసీడీహ జంక్షన్ నుంచి చెన్నైలోని తాంబరం మధ్య నడుస్తున్న 12376 వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలులో 15 మంది బాలబాలికలను రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. ఆ రైలు శుక్రవారం రాజమహేంద్రవరం చేరుకోగానే ఆర్‌పీఎఫ్ దళాలు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించాయి. బాలలను రక్షించి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరు పరిచారు. ఆ కమిటీ ఆదేశాల మేరకు ఆ పిల్లలను తాత్కాలిక వసతి కోసం విశాఖపట్నంలోని ప్రభుత్వ బాలల వసతి గృహానికి తరలించారు. తగు ఆధారాలతో వచ్చిన తల్లిదండ్రులకు ఆ పిల్లలను తిరిగి అప్పగించనున్నారు. బాలల అక్రమ రవాణాపై ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బాలల అక్రమ రవాణా చట్ట వ్యతిరేకమని, దీనికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చౌహాన్ హెచ్చరించారు. మానవ అక్రమ రవాణా జరుగుతున్నట్టు రైలు ప్రయాణికులు ఎక్కడైనా గమనిస్తే రైల్వే టోల్ ఫ్రీ నంబర్ 139కి ఉచితంగా ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, ఎస్సైలు నవీన్, లక్ష్మి, సిబ్బంది శ్రీకాంత్, జిలానీ, శ్రీనివాసరావు, రవికుమార్, ప్రకాష్, శ్రీరామ్, హేమ్‌సింగ్ పాల్గొన్నారు.

దేవస్థానం భూముల పరిశీలన



గొందిలో భూములను పరిశీలిస్తున్న ఈఓ ఆజాద్, ఏసీ రమేష్ బాబు తదితరులు

అన్నవరం: స్థానిక రత్నగిరి దేవస్థానానికి వివిధ గ్రామాల్లో ఉన్న వ్యవసాయ భూములను ఆలయ ఈఓ ఎన్ఎస్ చంద్రశేఖర్ అజాద్ శుక్రవారం పరిశీలించారు. దేవస్థానానికి కాకినాడ రూరల్ మండలంలోని తిమ్మాపురంలో 40.15 ఎకరాలు, శంఖవరం మండలం గొంది గ్రామంలో 34.33 ఎకరాలు, చెందుర్తిలో హైవేను ఆనుకుని 150 ఎకరాలు , సంపర గ్రామంలో 75 సెంట్ల భూమి ఉంది. ఈ భూములను ఈఓ చంద్రశేఖర్ అజాద్ పరిశీలించారు. వీటిలో ఏయే పంటలున్నాయి, కౌలు ఎంత వస్తుంది తదితర విషయాలను అధికారులు ఈఓకు వివరించారు. మిగిలిన గ్రామాల్లోని భూములను కూడా ఆయన శని, ఆదివారాల్లో పరిశీలిస్తారని అధికారులు తెలిపారు. ఈ నెల 18న దేవదాయ, ధర్మాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆలయాల భూముల వివరాలపై సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ఈఓ ఈ భూములు పరిశీలించినట్టు తెలిపారు. దేవస్థానం ఏసీ రమేష్ బాబు, సూపరింటిండెంట్ బలువు సత్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

స్తంభంపై ఉండగా విద్యుత్ షాక్



ధర్మేంద్ర కుమార్ మృతదేహం



ధర్మేంద్ర కుమార్ పడిపోయింది ఈ స్తంభం పైనుంచే

- కింద పడి అసిస్టెంట్ లైన్‌మన్ మృతి
- ద్వారకా తిరుమలలో ఘటన
- మృతుడు నల్లజర్ల వాసి

ద్వారకా తిరుమల: విద్యుత్ షాక్‌తో స్తంభం పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడిన ఒక అసిస్టెంట్ లైన్‌మన్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ద్వారకా తిరుమల వీఆర్ఎం ఫంక్షన్ హాలు వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన పాతూరి ధర్మేంద్ర కుమార్ (44) ద్వారకా తిరుమల మండలం రాళ్లకుంటలో అసిస్టెంట్ లైన్‌మన్‌గా, ద్వారకా తిరుమలలో ఇన్చార్జి అసిస్టెంట్ లైన్‌మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఉద్యోగ రీత్యా కొన్నాళ్లుగా అతడు మండలంలోని గొల్లగూడెంలోని ఒక అద్దె ఇంట్లో భార్య రాధికతో కలసి నివాసం ఉంటున్నాడు. మృతుడి ఒక్కగానొక్క కుమారుడు సాయి సత్యకృష్ణ బెంగళూరులో బీటెక్ (ఈసీఈ) మూడో సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం ఒక ఇంటికి కరెంటు సరఫరా నిలిచిపోవడంతో మరమ్మతుల నిమిత్తం ధర్మేంద్ర కుమార్ సబ్ స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకుని ఘటనా స్థలంలోని విద్యుత్ స్తంభం ఎక్కాడు. తెగిపోయిన ఎర్త్ వైర్ బిగిస్తుండగా.. సంబంధిత ఇంట్లోని ఇన్వర్టర్ నుంచి విద్యుత్ సరఫరా రివర్స్ వచ్చింది. దీంతో అతడు విద్యుత్ షాక్‌కు గురై, ఒక్కసారిగా స్తంభం పైనుంచి కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని విద్యుత్ శాఖ సిబ్బంది, స్థానికులు హుటాహుటిన ద్వారకా తిరుమల పీహెచ్‌సీకి తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితికి చేరుకున్న ధర్మేంద్ర కుమార్‌ను ప్రథమ చికిత్స అనంతరం, 108లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై టి.సుధీర్ తెలిపారు.

ట్రాక్టర్ అదుపు తప్పి డ్రైవర్ మృతి



ప్రమాద స్థలంలో కొండయ్య మృతదేహం

కొవ్వూరు: ట్రాక్టర్ అదుపు తప్పి, డ్రైవర్ మృతి చెందిన ఘటన ఐ.పంగిడి గ్రామ సమీపాన చోటు చేసుకుంది. కొవ్వూరు రూరల్ ఎస్సై జి.సతీష్ కథనం ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం దండగర్రు గ్రామానికి చెందిన ఎలిగంటి కొండయ్య (47) శుక్రవారం ఉదయం ఐ.పంగిడి సమీపంలోని ఒక క్రషర్‌లో మెటల్ లోడ్ వేసుకుని వెళ్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న సర్రు గుట్ట పైకి ఎక్కడంతో ట్రాక్టర్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కొండయ్య పట్టు తప్పి కింద పడిపోయాడు. ట్రాక్టర్ ట్రక్కు ఎక్కేయడంతో కొండయ్య అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దండగర్రు గ్రామానికి చెందిన చిక్కాల మురళి వద్ద కొండయ్య ఏడేళ్లుగా ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మృతుడి సోదరుడు రవికుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కొండయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మృత్యుశకటం



ప్రమాద స్థలంలో బాధితులు

- బైక్‌ను ఢీకొన్న లారీ
- లిఫ్ట్ అడిగి ఎక్కిన మహిళ దుర్మరణం
- మోటార్ సైక్లిస్టుకూ గాయాలు
- దివాన్‌చెరువు వద్ద ఘోరం

రాజానగరం: భర్త సంపాదన పైనే ఆధారపడిన కుటుంబానికి ఎంతో కొంత ఆసరాగా ఉందామనే ఉద్దేశంతో మగ్గం వర్కు నేర్చుకుని, సర్టిఫికెట్ తీసుకునేందుకు ఉత్సాహంగా వెళ్తున్న ఒక వివాహిత రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలైంది. ఆ కుటుంబాన్ని కన్నీటి సంద్రంలో ముంచి, కనుమరుగైపోయింది. జాతీయ రహదారిపై దివాన్‌చెరువు పెట్రోలు బంకు సమీపాన శుక్రవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. బొమ్మూరు ఎస్సై జగన్‌మోహన్‌రావు కథనం ప్రకారం.. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లికి చెందిన మండపాటి నాగేశ్వరరావు రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడు రాజానగరంలోనే మకాం ఉంటూ రోజు విధులకు వెళ్లి వస్తూంటాడు. భర్త సంపాదనకు తాను కూడా తోడు కావాలనే ఉద్దేశంతో అతడి భార్య మాధవి (28) దివాన్‌చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ద్వారా మగ్గం వర్కులో ఉచిత శిక్షణ పొందింది. ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్ల ప్రదానం శుక్రవారం ఉండటంతో ఇంటి నుంచి భర్తతో కలిసి బయలుదేరింది. జీఎస్ఎల్ వద్దకు వచ్చేసరికి తాను ఆసుపత్రిలో వేలిముద్ర వేయాల్సి ఉందని భర్త నాగేశ్వరరావు చెప్పాడు. ఆమెను రోడ్డు పైనే వదిలేసి, లోపలకు వెళ్లాడు. అదే సమయంలో రాజానగరం నుంచి ప్రసాద్ అనే వ్యక్తి మోటార్ సైకిల్‌పై రాజమహేంద్రవరం వైపు వెళ్తున్నాడు. తమకు తెలిసున్న వ్యక్తే కావడంతో అతడిని మాధవి లిఫ్ట్ అడిగింది. అతడి బైక్‌పై దివాన్ చెరువు వెళ్తుండగా పెట్రోలు బంకు సమీపాన వెనుక నుంచి అత్యంత వేగంతో వచ్చిన లారీ వారిని ఢీకొంది. కొంత దూరం వారిని, బైక్‌ను ఈడ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. మాధవి రెండు కాళ్లూ నుజ్జునుజ్జయిపోయాయి. కొన ఊపిరితో ఉన్న ఆమె రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమెకు లిఫ్ట్ ఇచ్చిన ప్రసాద్ కోలుకుంటున్నాడు. సంఘటన స్థలానికి ఫర్లాంగు దూరంలోనే డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఉంది. ఐదు నిమిషాల్లో అక్కడికి చేరుకుని, మగ్గం వర్కులో సర్టిఫికెట్ తీసుకోవలసిన మాధవి ఇలా దుర్మరణం పాలవడం తమను ఎంతగానో కలచివేసిందని ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు కన్నీటి పర్యంతమయ్యారు, మృతురాలికి భర్త, ఐదేళ్ల లోపు వయస్సున్న ఇద్దరు చిన్నారులు ఉన్నారు. బొమ్మూరు ఎస్సై జగన్‌మోహన్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంట కాలువలో పడి సైక్లిస్ట్ మృతి

పి.గన్నవరం: ప్రమాదవశాత్తూ పంట కాలువలో పడి ఒక సైక్లిస్టు మృతి చెందాడు. పి.గన్నవరం ఎస్సై హరికోటి శాస్త్రి కథనం ప్రకారం.. ఊడిమూడి శివారు ఆదిమూలంవారిపాలేనికి చెందిన సూదా ఏసుప్రసాద్ (52) అంబాజీపేటలోని కొబ్బరి కొట్టులో కార్మికునిగా పని చేస్తున్నాడు. రోజూ ఉదయం సైకిల్‌పై అంబాజీపేట వెళ్లి, పనులు ముగించుకుని రాత్రి ఇంటికి తిరిగి వస్తూంటాడు. ఇదేవిధంగా గురువారం రాత్రి అంబాజీపేట నుంచి ఆదిమూలంవారిపాలెం బయలుదేరిన ఏసుప్రసాద్ ఇంటికి చేరలేదు. అంబాజీపేటలోని కొబ్బరి కొట్టు వద్దే ఉండిపోయాడని అతడి కుటుంబ సభ్యులు భావించారు. అయితే, రాత్రి కావడంతో ఏసుప్రసాద్ యర్రంశెట్టివారిపాలెం వద్ద ప్రమాదవశాత్తూ సైకిల్‌తో సహా పంట కాలువలో పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. శుక్రవారం ఉదయం గమనించిన గ్రామస్తులు మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఏసుప్రసాద్ మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు సాయిరామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హరికోటి శాస్త్రి తెలిపారు.

ప్రాణం తీసిన మద్యం మత్తు

సామర్లకోట: తాగిన మైకంలో తల్లితో ఘర్షణకు దిగిన ఓ వ్యక్తి కింద పడి, గాయపడి, మృతి చెందిన సంఘటన స్థానిక బలుసులపేటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అప్పటికే తాగిన మైకంలో ఉన్న వడ్డే ప్రసాద్ (35) మరింతగా మద్యం తాగేందుకు తల్లి శాంతి కుమారిని డబ్బులు అడిగాడు. నిరాకరించిన తల్లితో గొడవకు దిగాడు.

ఈ క్రమంలో అదుపు తప్పి పడిపోవడంతో అతడి తలకు బలమైన గాయం తగిలింది. స్థానికులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ప్రసాద్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.